నిజామాబాద్ మార్కెట్‌లో పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

కొత్త ఊసులు.. కోటి ఆశలు

నేడు శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది

సుభాష్‌నగర్, ఏప్రిల్ 8: తెలుగు సంవత్సరాది నేడు ఉగాది. చైత్రశుద్ధ పాడ్యమి రోజు నుంచి నూతన తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది. మంగళవారం క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వితరణ, కవి సమ్మేళనాలు తదితర ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఉగాది పండుగ ప్రత్యేకత..

ఉగాస్య ఆది ఉగాది. ఉగా అనగా నక్షత్రగమనం. జన్మ నక్షత్రం అనుసరించి నవనాయకుల నిర్ణయం మేరకు కొత్త సంవత్సరంలో తిథి, వార, నక్షత్రాలను తెలుసుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. చైత్రశుద్ధ పాడ్యమి నాడు శ్రీరామ చంద్రుడు రాజ్య పట్టాభిషేకం చేశారని, ప్రకృతి పరంగా ఉగాది మనిషిలోని మానవత్వాన్ని ఆరోగ్య రక్షణకు ఉగాది పచ్చడిని సేవించడం ఆనవాయితీ. తెలుగు సంవత్సరాలు మొత్తం 60 ఉండగా, 38వ సంవత్సరం క్రోధినామ సంవత్సరం. క్రోధి అనగా కోపం అని అర్థం. ఈ సంవత్సరం నవనాయకుల్లో ఏడుగురు అశుభంగాను ఇద్దరు శుభంగాను ఉండడంతో అకాల వర్షాలు, యుద్ధ భయాలు, రాజుకు ప్రజలకు మధ్య వ్యతిరేకత తదితర అశుభ ఫలితాలున్నాయని పంచాంగకర్తలు పేర్కొంటున్నారు.

మార్కెట్‌లో ఉగాది శోభ..

ఉగాది పర్వదినం పురస్కరించుకొని సోమవారం సాయంత్రం నుంచి మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో సందడిగా మారాయి. పూలు, పండ్లు, మామిడికాయలు, మామిడికొమ్మలు, వేపపువ్వు, తాజా చింతపండు, బెల్లం తదితర పండుగ సామగ్రిని కొనుగోలు చేసేందుకు జనం పెద్ద సంఖ్యలో డైలీ, వీక్లీ మార్కెట్లకు తరలిరావడంతో కిటకిటలాడాయి.

శుభాకాంక్షలు తెలిపిన పోచారం

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 8: ఉమ్మడి జిల్లా ప్రజలకు మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి క్రోధినామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండి, రైతులు ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ధర్పల్లిలో మాట్లాడుతున్న నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

కాంగ్రెస్ గెలిచింది అబద్ధపు హామీలతోనే..

- **బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్**

ధర్పల్లి/ఇందల్వాయి, ఏప్రిల్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహాక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దోచుకోవడానికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని దుయ్యబట్టారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, పింఛన్లు, రైతుబంధు పెంపు తదితర వాటిని డిసెంబర్ 9న అమలు చేస్తామని చెప్పినప్పటికీ నేటి వరకు అమలు చేయలేదన్నారు. పరిపాలన చేసే సత్తా లేక కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ ఉంటే సంక్షేమం, లేకుంటే క్షామం..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందంటే ప్రకృతి సైతం సహకరించడం లేదని అన్నారు. కేసీఆర్ ఉంటే సమృద్ధిగా, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాయన్నారు. కేసీఆర్ ఉంటే సంక్షేమం లేకుంటే క్షామం అన్న పరిస్థితి ప్రకృతే తెలియజేస్తుందన్నారు. ఎమ్మెల్యేగా రూరల్ ప్రాంత అభివృద్ధికి ఎంతో చేశానని బాజిరెడ్డి ఈ సందర్భంగా ఆయన చేసిన పలు అభివృద్ధి పనులను వివరించారు. తాను చేసిన శంకుస్థాపనలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మళ్లీ శిలాఫలకాలు వేసి ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. అవసరమైతే పనులు పూర్తిచేసి ప్రారంభించుకోవాలన్నారు. ప్రస్తుత ఎంపీగా ఉన్న అర్వింద్ ఇప్పటి వరకు చేసిందేమీ లేకపోగా ఉచిత హామీలతో పబ్బం గడుపుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలను నిండా ముంచిన పార్టీ అని, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి తీరా హామీలను నెరవేర్చలేక చేతులెత్తేస్తున్నదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, సొసైటీ చైర్మన్లు చెలిమెల చిన్నారెడ్డి, రాజేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తాం

- **కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

సదాశివనగర్/బాన్సువాడ రూరల్/బిచ్కుంద/పిట్లం, ఏప్రిల్ 8: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. సదాశివనగర్ మండలం తిమ్మోజివాడి, బాన్సువాడ మండలం కొయ్యగుట్ట పరిధిలోని కెవులానాయక్ తండా, బిచ్కుంద మండలం వాజిద్‌నగర్, ఫత్లాపూర్, పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశామన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, పాఠశాల గదుల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం తదితర అభివృద్ధి పనులు చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీర్లకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి యోసెఫ్, పంచాయతీరాజ్ ఈఈ సదాశివరెడ్డి, డీఈలు వీరానంద్, బాలలింగం, ఏఈ మారుతి, రాకేశ్, ఎంపీడీవోలు సంతోష్ కుమార్, బషీరుద్దీన్, కమలాకర్, ఎంఈవో దేవీసింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సదాశివనగర్ మండలం తిమ్మోజివాడి పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి వేముల, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు

- **మోదీ, రేవంత్ ఇద్దరూ ఒక్కటే**
- **అన్ని కులమతాలను కలుపుకొనే పార్టీ బీఆర్ఎస్సే..**
- **మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి**

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 8: బీఆర్ఎస్ అంటే కులమతాలను కలుపుకొనే పార్టీ అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మపురిహిల్స్ లో ఉన్న డ్రైవర్స్ కాలనీలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి మాట్లాడారు. కేసీఆర్ హయాంలో ముస్లిముల అభ్యున్నతికి కృషి చేశామని, మసీదులకు అనేక నిధులు ఇచ్చినట్లు వివరించారు. మైనార్టీ ఆడబిడ్డలకు రూ. లక్షా116 ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఝూఠా పార్టీలను నమ్మొద్దని, మోదీ, రేవంత్‌రెడ్డి ఇద్దరూ ఒక్కటేనని అన్నారు. తెలంగాణ షిండేగా రేవంత్ రెడ్డిని అభివర్ణించారు. పసుపు బోర్డు తెస్తానని చెప్పిన ఎంపీ అర్వింద్ కాలయాపన చేశారని, ప్రస్తుతం గెలవనని తెలిసి మోదీకి ఓటు వేయాలని ప్రజలని వేడుకుంటున్నారని తెలిపారు. ఉక్కులాంటి మనిషి బాజిరెడ్డి గోవర్ధన్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మూడు నెలలకే కరువు కష్టం వచ్చిందన్నారు. బాజిరెడ్డిని గెలుపించుకుంటే ఢిల్లీలో కొట్లాడుతారని తెలిపారు. కార్యక్రమంలో మీర్ మజాజ్ అలీ, ఎస్ఏ అలీం, నగర అధ్యక్షుడు సిర్పరాజు, ఫయాజ్, నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్, ప్రభాకర్‌రెడ్డి, సత్యప్రకాశ్, సుజిత్ సింగ్ ఠాకూర్, రవిచందర్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మైనార్టీలతో కలిసి ప్రార్థనలు చేశారు.

అవినీతిపరులకు అవకాశం ఇవ్వొద్దు

- **కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి**

కామారెడ్డి,ఏప్రిల్ 8: కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో అవినీతిపరులకు అవకాశం ఇవ్వొద్దని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి అభివృద్ధి కోసం కౌన్సిలర్లందరూ పార్టీలకు అతీతంగా మంచి వ్యక్తిని చైర్మన్‌గా ఎన్నుకోవాలని సూచించారు. మున్సిపాలిటీపై ఉన్న రూ.44కోట్ల అప్పు తీర్చి పట్టణ ప్రగతి కోసం అందరం కలిసి నడుద్దామన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కాంగ్రెస్ అవిశ్వాసం పేరిట రాజకీయం చేస్తున్నదని అన్నారు. కామారెడ్డిలో అవినీతికి ఆజ్యం పోసింది షబ్బీర్ అలీనేనని విమర్శించారు. అవినీతి రహిత కామారెడ్డిగా చూడడమే తన లక్ష్యమని అన్నారు. రాజకీయ స్వలాభం కోసం ఏ ప్రభుత్వం ఉంటే ఆ పార్టీలోకి మారడం మంచి పద్ధతి కాదని అన్నారు.

వడగండ్ల వాన

- **తడిసిన ధాన్యం**

చందూర్‌లో కురిసిన వడగండ్లు

కోటగిరి /చందూర్, ఏప్రిల్ 8: వర్ని, చందూరు, కోటగిరి, రుద్రూర్, బోధన్ తదితర మండలాల్లో సోమవారం రాత్రి వడగండ్ల వర్షం కురిసింది. టాక్లీ, సోంపూర్, కొల్లూర్, సుంకిని తదితర గ్రామాల్లో కురిసిన వడగండ్లతో వరి పైర్లు దెబ్బతిన్నాయి. వడ్లు రాలిపోయాయి. చేతికొచ్చిన ధాన్యం నేలపాలైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, పంట కోసి ఆరబోసిన వడ్లు సైతం తడిసి ముద్దయ్యాయి.

రక్తదానంతో విలువైన ప్రాణాలు కాపాడొచ్చు

రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న న్యాయమూర్తి

కామారెడ్డి, ఏప్రిల్ 8: రక్తదానంతో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్.శ్రీదేవి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రెడ్‌క్రాస్, జిల్లా ప్రధాన దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం అడ్వకేట్స్ సొసైటీ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ ఒక వ్యక్తి మరొక వ్యక్తికి ఇవ్వగలిగే అత్యంత విలువైన బహుమతి ప్రాణదానం అంటే రక్తదానమని అన్నారు. తలసేమియా, హీమోఫిలియా వంటి వ్యాధులతో బాధపడే రోగులతోపాటు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు రక్తం ఎంతో అవసరమని అన్నారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ రక్తదానం చేయడంలో జిల్లా ప్రజలు ముందుండడం ఎంతో ముదావహమని అన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నామని అన్నారు. శిబిరంలో న్యాయవాదులు,కోర్టు సిబ్బంది, ఇతరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్ రావు, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి నాగరాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ చింతల గోపి, సెక్రటరీ సురేందర్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, కార్యదర్శి రఘుకుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజగోపాల్ గౌడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మండే కాలం.. పశువులు జాగ్రత్త!

- **ఈసారి గతంలో కన్నా గరిష్ఠ ఉష్ణోగ్రతలు**
- **యాజమాన్య జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు**

డోంగ్లీ, ఏప్రిల్ 8: కొన్నిరోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. మనుషులతోపాటు పశుపక్ష్యాదులు సైతం అల్లాడుతున్నాయి. వేసవికాలంలో పశువుల సంరక్షణపై జాగ్రత్తలు అవసరం. ఎండాకాలం పూర్తయ్యే వరకు పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గకుండా చూడాల్సిన బాధ్యత పశుపోషకదారులపైన ఉంది. అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగ్గా లేకపోవడం, షెడ్డుల్లో ఎక్కువ సంఖ్యలో పశువులను ఉంచడం, ఉక్కపోత, తాగునీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. వడదెబ్బకు పశువులు క్రమంగా నీరసించి సరిగ్గా నడకలేకపోయి తూలిపోతుంటాయి. జీర్ణ ప్రక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, ఆహారం తక్కువ తీసుకోవడంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడంతో ఇతర వ్యాధులు, పరాన్నజీవులు ఆశించే అవకాశం ఉంటుంది. కొన్ని సమయాల్లో దాహంతో ఉన్న పశువులు మురికి నీళ్లు తాగడంతో పారుడు వంటి జీవకోశ రోగాలు వచ్చే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావం, వడదెబ్బకు గురైన పశువుల్లో దాహం పెరిగిపోయిన నడుచుకుంటూ కింద పడిపోవడం లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి శ్వాస తీసుకోవడం కష్టమై అపస్మారక స్థితిలో వెళ్లి మృతి చెందే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో చల్లని ప్రదేశంలో బకెట్ నీటిలో కిలో బెల్లం వేసి తాగించాలి. అనంతరం సమీపంలోని పశువుల డాక్టర్‌ను సంప్రదించాలి.



పచ్చిగడ్డితో మేలు..

వేసవిలో సులువుగా జీర్ణమయ్యే గడ్డినివ్వడంతోపాటు ఎక్కువ శాతం పచ్చి మేతను ఇవ్వాలి. పచ్చి గడ్డి ఉదయం, రాత్రి సమయాల్లో ఎండు గడ్డి ఇవ్వడంతో మంచి ప్రయోజనం కలుగుతుంది. తౌడు లాంటి దాణాలో ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మంచిది. పశువులను ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు బయటికి పంపడం మంచిది.వేసవికాలం పూర్తయ్యే వరకు పశువులకు చల్లటి నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలి. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల నివారణ మందులను క్రమంగా తాగించాలి. వడదెబ్బ సోకిన పశువులకు ప్రథమ చికిత్స అందించి , ఉష్ణోగ్రత తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.

జాగ్రత్తగా కాపాడుకోవాలి

ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. జీవాలకు ఎండదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పచ్చిగడ్డికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ రెండు నెలలు పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత యజమానులపై ఉంది.

-వినీత్‌కుమార్, పశువైద్యాధికారి, డోంగ్లీ